క్లుప్తంగా

ఆలయ ప్రహరీ నిర్మాణం



ప్రహరీ గోడకు పూజలు చేస్తున్న చైర్మన్, దాతలు

పాకాల: స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో గర్భగుడి ప్రదక్షిణ చేసేందుకు ప్రహరీ గోడ నిర్మాణం చేశారు. తూర్పు భాగంలో దాత వానాద్రి నాయుడు సహకారంతో సుమారు రూ.2.35 లక్షల నిధులతో ప్రహరీ నిర్మించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు.
మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

తుమ్మలగుంట గంగమ్మకు సారె సమర్పణ



గంగమ్మకు సారెను తీసుకొస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంట చెంచువారి కాలనీ జాతర సందర్భంగా చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గంగమ్మకు సారె సమర్పించారు. మంగళవారం తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి చెంచువారికాలనీకి ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. తిరుపతి రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ పాల్గొన్నారు.

దినకర తేజా... గోవిందా..!

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం వెలుగును నింపే దినకరుడిని, రాత్రి చల్లని వెలుగుతో నింపే చంద్రుడిని వాహనంగా చేసుకుని కల్యాణ వెంకన్న విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కైంకర్యాలు పూర్తి చేశారు. దీప ధూప నైవేద్యాలను సమర్పించారు. 8.30 గంటలకు సూర్యప్రభ వాహనాన్ని విశ్వరూప దర్శనధారిగా శ్రీవారు అధిష్టించి పురవీధుల్లో ఊరేగారు. వీధుల్లో మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం బాల గోపాలునిగా స్వామి వారు ఉయ్యాలసేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించిన ఉత్సవమూర్తులు ఊరేగింపుగా బయలుదేరారు. ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు స్వామి వారి రథోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. సాయంత్రం అశ్వవాహన సేవ అనంతరం రాత్రి 7 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవంలో దంపతులు వెయ్యి రూపాయలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

రైతన్నలకు వెన్నుదన్ను

- ఐదోసారీ వైఎస్సార్ రైతు భరోసా జమ
- నియోజకవర్గంలో 30,001 మందికి రూ.22.50 కోట్లు విడుదల

మండలం	రైతులు	మొత్తం (రూ.కోట్లలో)
రామచంద్రాపురం	4664	3.64
పాకాల	6259	4.69
చంద్రగిరి	4981	3.74
తిరుపతి రూరల్	3611	2.71
చిన్నగొట్టిగల్లు	4825	3.62
ఎర్రావారిపాలెం	5661	4.25
మొత్తం	30001	22.50



సాగుకు సిద్ధమవుతున్న రైతులు

రామచంద్రాపురం: పంట సాగుకు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయకుండా వైఎస్సార్ రైతు భరోసా వెన్నుదన్నుగా నిలుస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా చీకూచింతా లేకుండా పంటల సాగు చేసుకుంటున్నామని చెబుతున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో నీటి పారుదల ప్రాజెక్టులు లేవు. రైతులు విద్యుత్ మోటార్లపైనే ఆధారపడుతున్నారు. ప్రధానంగా వరి, వేరుశనగ, చెరుకు, టమాటతోపాటు ఇతర కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం అంతగా గిట్టుబాటు కాక పోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు పంటసాగుకు చేయూత ఇవ్వాలని నిర్ణయించి రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. సాగుకు ముందే ఖాతాలో ఏడాదికి రూ.13,500 చొప్పున జమ చేస్తుండడంతో రైతులు పెట్టుబడి కోసం ఎదురు చూసే పనిలేకుండా పోయింది. దీంతో సాగు విస్తీర్ణం కూడా ఘననీయంగా పెరిగింది.
రామచంద్రాపురం మండలంలో గతంలో 6,046 ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం ప్రస్తుతం 7901 ఎకరాలకు పెరిగింది. అదేవిధంగా ఎర్రావారిపాలెంలో 8,639 ఎకరాల్లో సాగు ఉండగా ప్రస్తుతం 10,301 ఎకరాలు, చిన్నగొట్టిగల్లులో 9,792 ఎకరాల్లో సాగు చేసేవారు. ప్రస్తుతం అది 11,337 ఎకరాలకు చేరింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో రామచంద్రాపురంలో 4,664 మంది రైతులకు ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా తొలివిడత పెట్టుబడి సాయం కింద రూ.3.50 కోట్లు, పాకాలలో 6,259 మంది రైతులకు రూ.4.69 కోట్లు, చంద్రగిరిలో 4,981 మంది రైతులకు రూ.3.74 కోట్లు, తిరుపతి రూరల్‌లో 3,611 మంది రైతులకు రూ.2.71 కోట్లు, చిన్నగొట్టిగల్లులో 4,825 మంది రైతులకు రూ.3.62 కోట్లు, ఎర్రావారిపాలెంలో 5,661 మంది రైతులకు రూ.4.25 కోట్ల నగదు వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారు. అలాగే ఆర్బీకేల ద్వారా రైతులకు ఎప్పటిప్పుడు అధికారుల సలహాలు, సూచనలు అందుతున్నాయి. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సకాలంలో అందజేస్తున్నారు. పగలు 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తుండడంతో ఇబ్బందులు తప్పాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటసాగుకు సమాయత్తం అవుతున్నారు.

ఎన్నో ఏళ్లు ఇబ్బంది పడ్డా



ఎన్నో ఏళ్లుగా పంట పెట్టుబడికి పలువురి వద్ద వడ్డీకి తీసుకుని సాగు చేసేవాడిని. దీని వలన పంట చేతికి వచ్చినా బాకీ తీర్చడానికి పోనూ కొంత మాత్రమే మిగిలేది. జగనన్న ప్రభుత్వం వచ్చాకా పంట పెట్టుబడికి ఎలాంటి ఇబ్బంది లేదు. అంతేగాక పంటలకు గిట్టుబాటు ధర కలిస్తుండడంతో చాలా సంతోషంగా ఉంది.

– దొరస్వామి, రైతు, నెత్తకుప్పం

రైతు భరోసా అందించడం అభినందనీయం



గత ప్రభుత్వం రైతులను ఆదుకోలేదు. పెట్టుబడి కోసం బ్యాంకుల్లో బంగారు నగలు తాకట్టుపెట్టుకోవాల్సి వచ్చేది. అంతేగాక అధిక వడ్డీలకు తీసుకునేవాళ్లం. జగనన్న పాదయాత్రలో రైతు కష్టాలను తెలుసుకుని ప్రతి ఏటా రూ.13,500 వైఎస్సార్ రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట దెబ్బతిన్న రైతులకు సాయం అందించడం అభినందనీయం.

– క్రిష్ణారెడ్డి, రైతు, టీవీ సపార్లు

చంద్ర స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

–సీపీఐ రాష్ట్ర నేత హరినాథరెడ్డి



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: భూపోరాట యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నేత రాజేశ్వరరావు జీవితం స్ఫూర్తిగా తీసుకుని ప్రజా పోరాటాలు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి అన్నారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం చంద్ర రాజేశ్వరరావు 109వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. రాజేశ్వరరావు భూస్వామ్య కుటుంబంలో పుట్టినా కమ్యూనిస్టు భావజాలంతో అతని సొంత భూమిని కూడా భూమి లేని వారికి పంచిన చరిత్ర ఆయనదేనన్నారు. చల్లపల్లి జమిందారులతో పోరాటం చేసి దున్నేవాడికే భూమి అనే నినాదంతో వేల ఎకరాలు పేద ప్రజలకు పంచారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేమయ్య యాదవ్, సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ, నాయకులు చలపతి, రాధాక్రిష్ణ, ఎన్‌డీ రవి, శివ, శ్రీరాములు, గోవిందస్వామి, సీహెచ్.శివ, రామచంద్రయ్య, సాయి, ఏపీ, బాల, ప్రవీణ్ పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక అందజేత



విద్యా కానుకలను హెచ్‌ఎంలకు అందజేస్తున్న ఎంఈఓ

పాకాల: స్థానిక సీఆర్సీ కార్యాలయంలో జగనన్న విద్యా కానుకలను హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాబ్జీ మాట్లాడుతూ..జగనన్న విద్యా కానుకలో యూనిఫామ్, బ్యాగులు, బెల్టులు, షూస్, సాక్స్, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటిని హెచ్‌ఎంలు విద్యార్థులకు కిట్‌లను అందజేయాలన్నారు.

ఏడీఏ బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట రూరల్: స్థానిక వ్యవసాయ సంచాలకులుగా గుమ్మడి అనిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏడీఏ నాగరాజు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నెల్లూరులో వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న అనిత బదిలీపై ఇక్కడకు వచ్చారు.



స్వచ్ఛత లోపిస్తే చర్యలు



విష్ణు నివాసం వద్ద కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

- మరింత మెరుగ్గా పారిశుధ్యం
- కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగ్గా అమలు చేయనున్నట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ హరిత మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడం, కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తుండటాన్ని గుర్తించిన కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విష్ణు నివాసం చుట్టూ ఉన్న తోపుడు బండ్లు, షాపుల వాళ్లు కాలువల్లో చెత్త వేస్తున్నారని సిబ్బంది కమిషనర్‌కు వివరించారు. దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని కమిషనర్ ప్రశ్నించారు. వారిని గుర్తించాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య విషయంలో కారణాలు వెతకవద్దని, పరిశుద్ధ తిరుపతి కోసం నిరంతరం పనిచేయాల్సిందేనని సూచించారు. వార్డుల వారి తనిఖీలు నిర్వహిస్తానని, ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తిరుపతికి ఉన్న పవిత్రత, నిత్యం వేలాది మంది యాత్రికుల రాకపోకలను ఉంచుకుని క్లీన్ తిరుపతి కోసం అనునిత్యం పనిచేయాల్సిందే అన్నారు. ప్రజలకు, వ్యాపారులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఇల్లు, దుకాణాల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు మాత్రమే చెత్తను ఇవ్వాలని, ఖాళీ స్థలాలు, రోడ్లు, కూడళ్లలో చెత్తను పారబోస్తే తీవ్ర చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపితేనే స్వచ్ఛ తిరుపతి సాధ్యమవుతుందన్నారు. మన ఇల్లు–మన తిరుపతి అన్న నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, పారిశుధ్య అధికారులు, సిబ్బంది ఉన్నారు.

భార్యపై దాడి చేసిన కేసులో భర్త అరెస్టు

నాయుడుపేటటౌన్: నగదు కోసం భార్యపై దాడి చేసిన కేసులో భర్తను మంగళవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మన్నారు సుధకు అనూప్‌కుమార్‌తో 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారంలో అనూప్‌కుమార్ అప్పులపాలై తరచూ ఇంట్లో వస్తువులను అమ్మేస్తుండడంతో భార్య సుధ అడ్డుకునేది. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీ భార్యతో గొడవకు దిగిన అనూప్‌కుమార్ ఆమెపై దాడి చేసి గాయపరిచాడు.

వేడుకగా గంగమ్మ జాతర



గంగమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

తిరుపతి కల్చరల్: నగరంలోని లెనిన్ నగర్‌లో మంగళవారం గంగమ్మ జాతర వేడుకగా నిర్వహించారు. తిరుపతి గంగమ్మ జాతర అనంతరం ఐదు వారాల పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గొప్ప వేడుకగా గంగమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మూడో డివిజన్‌లోని లెనిన్‌నగర్, గరుడాద్రి నగర్ పరిధిలో జాతర నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వెంకటేష్, సోమశేఖర్, లెనిన్‌నగర్, గరుడాద్రినగర్ గ్రామ కమిటీ సభ్యులు మురళి, బాబు, వెంకట సిద్ధులు, హరినారాయణ, దామోదర పాల్గొన్నారు.

పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుకను అందజేస్తున్న నాయకులు

పాకాల: మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ మల్లెలచెరువుపల్లి గ్రామంలో వివాహం చేసుకోనున్న హరికృష్ణ, రమ్య జంటకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను మంగళవారం అందజేశారు. బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాజికాలు, పట్టు బట్టలు, తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీ సభ్యుడు సురేష్, నాయకులు మునిరత్నంరెడ్డి, నాగూర్‌బాషా, శివకుమార్, వనజ, భాస్కర్‌నాయుడు, అన్నాబాబు, నాగరాజు పాల్గొన్నారు.
చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం ఐతేపల్లి పంచాయతీ మామండూరు గ్రామానికి చెందిన హేమాద్రి నాయుడు కూతురు మౌనిక ప్రసన్నకు బుధవారం వివాహం జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లి కానుక పంపించారు. మంగళవారం పెళ్లి కానుకను వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు దేవరాజులురెడ్డి, ఐతెపల్లి సర్పంచ్ ఫాజిల్లా, అంజాద్, సింగిల్ విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి అందించారు. వధువు ఇంటికి ఒక మేనమామలా చెవిరెడ్డి పంపిన పెళ్లి కానుకను ఆ కుటుంబ సభ్యులు సంతోషంగా స్వీకరించారు.



ఐతేపల్లిలో పెళ్లి కానుకను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరునాళ్ల చూతము రారండి!

- చెంగాళమ్మ బ్రహ్మోత్సవాల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు
- సాంస్కృతిక కార్యక్రమాలకు సినీ ప్రముఖులు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలను ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్చిలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వేదిక, రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణ తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి అమ్మవారి ఉత్సవాలు, సాయంత్రం 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలివీ..

ఈ నెల 8వ తేదీన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బలిహరణ, సుడిమాను ప్రతిష్ట నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు తిరునాళ్ల ప్రారంభం అవుతుంది. రాత్రి చెంగాళమ్మ చరిత్ర నృత్యరూపకాన్ని టీటీడీ కళాకారులు ప్రదర్శిస్తారు. తొలిరోజు ముఖ్యఅతిథిగా సినీ హీరోయిన్ సురభి విచ్చేయనున్నారు. సినీ ప్లేబ్యాక్ సింగర్ రేణుకుమార్ చే సంగీత విభావరి, ఫోక్ సింగర్ పల్సర్ బైక్ రమణ, కళాంజలి ఆర్కెస్ట్రా, జబర్దస్త్ సునామీ సుధాకర్ బృందం చే హాస్యవల్లరి, కొరియోగ్రాఫర్ ఢీపేమ్ అభిమాస్టర్ బృందం ఆధ్వర్యంలో డాన్స్‌లు ఏర్పాటు చేశారు.

- 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు సుళ్ల ఉత్సవం, అనంతరం అమ్మవారి అశ్వవాహన సేవ నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమంలో సినీ ప్లేబ్యాక్ సింగర్స్ మోహన భోగరాజ్, సుమంత్, తెలంగాణా ప్రఖ్యాత ఫోక్ సింగర్ కనకవ్వచే సంగీత విభావరి, బుల్లెట్ భాస్కర్ బృందం చే జబర్దస్త్ కామెడీ షో, రమేష్ మాస్టర్, పల్సర్ బైక్ ఝాన్సీ బృందం నృత్యం, కొరియోగ్రాపర్ ఢీఫేమ్ పండు మాస్టర్ చే డాన్స్ తోపాటు సినీ యాంకర్ శైలజవర్మ యాంకర్ వ్యవహరించి పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.
- 10వ తేదీ సాయంత్రం సుళ్ల ఉత్సవం, రాత్రి 9 గంటలకు మహిషాసురమర్దిని (యుద్ధం), అనంతరం అమ్మవారి సింహవాహన సేవ నిర్వహించనున్నారు. మహిషాసుర మర్దిని కార్యక్రమంలో భారీ ఎత్తున బాణ సంచా వేడుకలను నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శివమణి చే డ్రమ్స్ వాయిద్యం, సినీ హీరోయిన్ మన్నార చోప్రా విచ్చేయనున్నారు. సినీ ప్లేబ్యాక్ సింగర్ కీర్తనశర్మ, సాయిశిల్ప, ఫోక్ సింగర్ తేలు విజయ, శక్తి ఈవెంట్స్ వారిచే సంగీత కచ్చేరి, బుల్లెట్ భాస్కర్ బృందం జబర్దస్త్ కామెడీ షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సినీ యాంకర్ శ్యామల యాంకర్‌గా వ్యవహరించనున్నారు.
- 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు సుళ్ల ఉత్సవం, రాత్రి 9 గంటలకు నంది వాహన సేవ నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సినీ హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్ ప్రత్యేక ఆకర్షణగా తీసుకొస్తున్నారు. జీ తెలుగు సరిగమప బృందం సినీ ప్లేబ్యాక్ సింగర్స్ శివ, సాయిచరణ్, శివానీ, శ్రీకాంత్, శృతిక, సన్విధ్, హాని, కోరస్ సింగర్స్ గాయత్రి, శ్రావణి, వంశీ, హర్షిత్, ఫోక్ సింగర్ మౌనిక సంగీత విభావరి నిర్వహించనున్నారు. నూకరాజు బృందంచే జబర్దస్త్ కామెడీషో, సాగర్ మాస్టర్ బృందంచే డాన్స్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు సినీ యాంకర్ ఐశ్వర్య యాంకరింగ్ చేయనున్నారు.
- 12వ తేదీ సాయంత్రం 7 గంటలకు చెంగాళమ్మ తల్లి కాళంగినదిలో తెప్పపై విహరించనున్నారు. రాత్రి 9 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. తెప్పోత్సవం తరువాత బాణసంచా వేడుకలను ఘనంగా జరపనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జీ తెలుగు సరిగమప బృందం సినీ ప్లేబ్యాక్ సింగర్స్ గీతామాధురి, ఎస్ఎస్‌వీ ప్రజ్ఞ, వాగ్దేవి, జేపీ తదితరుల చే పాట కచ్చేరి, సత్యం మాస్టర్ బృందం చే డాన్స్‌లు తదితర కార్యక్రమాలకు సినీ యాంకర్స్ నందిని, సురాగ్ యాంకరింగ్ చేయనున్నారు.
- 13వ తేదీ రాత్రి 9 గంటలకు అమ్మవారికి శయన సేవ, అనంతరం రాత్రి 10 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. సినీ హీరోయిన్ నేహా శెట్టి, సినీ యాంకర్ స్వాతి యాంకర్‌గా వ్యవహరించనున్నారు. సినీ ప్లేబ్యాక్ సింగర్స్ ధనంజయ్, సమీరా భరద్వాజ బృందం చే పాటకచ్చేరి, తెలంగాణా ఫోక్ సింగర్ పద్మశ్రీ మొగిలయ్యతో పాటకచ్చేరి, గల్లీబాయ్స్ సద్దాం బృందం చే హాస్యవల్లరి, డాన్స్ మాస్టర్ చిట్టి బృందం, జూనియర్ చిరంజీవి (కరీముల్లా) డాన్స్ బృందం చే నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.
- 14వ తేదీ రాత్రి 9 గంటలకు అమ్మవారికి పుష్పపల్లకిసేవ నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ముగింపులో భాగంగా 'వీరసింహారెడ్డి' సినిమా హీరోయిన్ హనీరోజ్ విచ్చేయనున్నారు. సినీ ప్లేబ్యాక్ సింగర్స్ కీర్తనాశర్మ, స్థానికంగా ఉన్న స్వర గోపురం ఆర్కెస్ట్రా బృందం చే పాట కచ్చేరి, వెంకీ మంకీ బృందం, ఢీఫేమ్ సుదర్శన్ బృందం చే నృత్య ప్రదర్శనలు, సాయి హేమంత్ చే నాశికా వేణుగానం కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



RBI లైసెన్స్ NO. UBD AP.563P | స్థాపితం: 1918

ది తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
రిజిస్టర్డు కార్యాలయము: 23, గో.తేరువీధి, తిరుపతి-517501
ఫోన్: 0877-6640634, 0877-2225159,
Email:tcbl.tirupati@gmail.com

సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (SARFAESI Act 2022) సంబంధి సెక్షన్ 13 (2) క్రింద జారీ చేయబడిన

డిమాండు నోటీసు

కు
శ్రీ/శ్రీమతి వై.ఆర్.గిరీష్ కుమార్ తండ్రి వై.రాఘవయ్య,
డో.నెం.19-12-185, బైరాగిపట్టెడ, తిరుపతి-517501 ... రుణగ్రహీత
అయ్యా!
మీరు తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, తిరుపతి, ప్రధాన కార్యాలయము బ్రాంచ్ నుండి ఇంటి తనఖా సెక్యూరిటీపై ఈ క్రింద కనబరచిన ఋణ సౌకర్యము పొందియున్నారు.
ఇంటి తనఖా (ML) సెక్యూరిటీ ఋణం తేది: 24.09.2020, ఋణఖాతా నెం. 21562, ఋణం మొత్తం రూ. 15,00,000 వడ్డీతో బాటు చెల్లించవలసిన ఋణ బాధ్యత మొత్తం రూ. 18,05,763/- (తేది:29.04.2023 నాటికి).
పై ఋణము మా బ్యాంకు పేరిట వ్రాసి ఇవ్వబడిన రిజిస్టర్డు ఈక్విటబుల్ తనఖా దస్తావేజు పత్రము నెం.2893/2020 ప్రకారము ఈ క్రింది షెడ్యూలులో కనబరచిన ఇంటి తనఖా సెక్యూరిటీ కలిగియున్నది.
మీరు మా బ్యాంకు నుండి ఋణ సౌకర్యము పొందిన తర్వాత వడ్డీతో సహా ఋణము మొత్తమును తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనందున సదరు ఋణ ఖాతా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల మేరకు నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినది. కావున పై కనబరచిన ఋణ బాకీ మొత్తము రూ.18,05,763/- [illegible] వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా 60 దినములలో చెల్లించమని కోరుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము, 2002 సంబంధి సెక్షన్ 13 (2) క్రింద తేది: 10.05.2023 న డిమాండు నోటీసు రిజిస్టర్డు పోస్టు ద్వారా మీరు తెలిపియున్న పై చిరునామాకు జారీ చేసియున్నాము.
సదరు నోటీసు మీకు బట్వాడా కాక వాపసు వచ్చినది. అందువలన సదరు చట్టము సంబంధి సెక్షన్ 13 (2) తో చదువబడు రూల్ 3 (1) ననుసరించి డిమాండు నోటీసును తనఖా స్థిరాస్తి వద్ద అతికించడమైనది. మరియు ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు విషయమును తెలియజేయుచున్నాము. కావున పైన పేర్కొన్న ఋణ బాకీ పూర్తి మొత్తము అనగా రూ.18,05,763/-, వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలతోసహా ఈ నోటీసు అందిన 60 దినములలోగా చెల్లించవలసినదిగా [illegible]

తనఖాలోని స్థిరాస్తి షెడ్యూలు

[illegible]

తేది: 07.06.2023
ప్రదేశము: తిరుపతి

సం/- అధీకృత అధికారి
ది తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, తిరుపతి